# అతిరథులూ మహారథులూ

"కుటింది గుణవంతురాలూ, కూసింది గయ్యాళీ...!మీరు చేసేపిచ్చిచేష్టలన్నీ ఎవరికీ తెలీవు. నేను వాగింది మాత్రం అందరికీ వినిపిస్తుంది. పొద్దున్నగా కొళాయి దగ్గర బిందెలు పారేసి కాళ్ళు చాచుక్కూచున్నాను. ఎంతకీ వదలరాయను. పట్టుకున్న నీళ్ళన్నీ ఏ గోతిలో పోస్తున్నారో తెలీటం లేదు. ఇంత మొండికాపురాన్నింట్లో పెట్టుకుని, వేగడం బ్రహ్మతరంగాదుగదా బ్రహ్మనుపుట్టించిన వాడిక్కూడా చేతగాదు. రామ!...రామ...ఇంత ముదనష్టపు వాళ్లు ప్రపంచంలో పుట్టగ...పుట్టబోరు!"

ఇలా ఏకటాకీని, మూర్తిదాల్చిన కాళికలా గర్జిస్తోంది గజలక్ష్మమ్మగారు. ఆంజనేయస్వామిగారికోసం అప్పుడే గడపలో అడుగుపెట్టిన సుబ్బారావు అమాంతం నించుండిపోయాడు పక్కకి తొలగి.

"అవునే! మట్టూమర్యాదా లేని వాళ్లతో మాటలు పెంచుకోటం, మనకుమాత్రం ఏం మర్యాద?...పక్కయింటి కెళ్లి పట్టుకొచ్చుకోండి ఈపూటకి నీళ్ళు!"

అతినింపాదిగా అంటున్న ఆంజనేయస్వామిగారి కంఠం వినిపించింది సుబ్బారావుకు.

గొంతు సవరించుకుంటూ గోడ పక్కనించి గుమ్మంలోకి వచ్చాడు సుబ్బారావు. కంఠధ్వని విన్నారు కాబోలు గబగబా వాకిట్లోకి వచ్చారు ఆంజనేయస్వామిగారు 'ఎవరక్కడ' అంటూ.

అప్పటివరకూ జరిగిన ఆర్భాటం చూసి, పరిస్థితి బాగా లేదని భావించి, యింటిముఖం పట్టబోతున్న సుబ్బారావును చూసి, ఆంజనేయస్వామిగారు ఆహ్వానించారు లోపలికి. సమయం కాని సమయమైనా తప్పనిసరి అవడం చేత, లోపలికెళ్ళికూర్చున్నాడు సుబ్బారావు.

"ఆంజనేయస్వామిగారు అందెవేసిన చెయ్యి జాతకాలు రాయడంలో. సంస్కృతాంధ్ర సాహిత్యాల్లో ఆయనతో సమానంగా నిలబడగల వ్యక్తి నిజంగా లేడనవచ్చు. ఎంత పండితుడో అంత సాత్త్వికుడు. నోటిలో నాలుక లేదు. మెత్తగా జడపత్తిలా కనిపిస్తాడు. ప్రతివాళ్ళనీ, యిట్టే ఆకర్షిస్తాడు. ఎంతటి ఘాటైన మాటైనా ఆయన కంఠం దాని కొక అందమైన, మృదు మధురమైన స్వరూపం మలచగలదు. సజ్జనుడు. స్నేహపాత్రుడు. ఇతరుల కష్టసుఖాలలో అవలీలగా పాలుపంచుకోగలిగిన పరమ ధార్మికుడు"

ఇది ఆంజనేయస్వామిగార్ని గురించి ఆవూళ్లో అందరనుకునే మాటలు.

అలాంటి ఆంజనేయస్వామిగారికోసం అంత సేపట్నుంచీ సుబ్బారావు కాచుక్కూచున్నాడంటే ఆశ్చర్యమేముంది?... అందులో అతను జీవితయాత్రలో అడుగుపెట్టిన తొలి రోజుల్లో అందాలు చిందించే కొడుకు పుట్టాడు సుబ్బారావుకు. ఆ చిన్నారి కొడుకు జాతకం, ఆంజనేయస్వామిగారి హస్తాల్లో వ్రాయించాలని అతని ఊహ. అందుకే అంత పొద్దున్నే - అలా వచ్చి వాకిట్లో నిలబడ్డాడు. జననం గురించి చెప్పి, తిథి వార నక్షత్రాలు కనుక్కొని, 'తీరిక చేసుకు మీరు త్వరగా రాసి ఇవ్వాలి:' అని అతి విధేయత అగుపించేట్టు

## శ్రీనివాసకాశ్యప

చెప్పి - యింటి ముఖం పట్టాడు సుబ్బారావు.

* * *

ఆంజనేయస్వామిగారంటే ఆ వూళ్ళో తెలీని వ్యక్తిలేడు. చిన్ననాటినుండీ కొన్ని లక్షల జాతకాలు వ్రాసిపారేసుంటాడాయన. తరతరాలుగా వారి కదే వృత్తి. వారి వంగడంలో అందరూ పండిత ప్రకాండులే; పరమశ్రోత్రియులే!

పైన శాలువా కప్పుకుని, పంచాంగం చేత్తో పట్టుకుని బయల్దేరితే - ఆంజనేయస్వామిగారు, అక్కడక్కడా మజిలీలు చేసుకుంటూ ఆయన్ను అన్నివిధాలా గౌరవించే పెద్దల యిళ్లన్నీ ఓసారి చుట్టబెట్టి - ఏ పన్నెండింటికో తిరిగొస్తూంటారు యింటికి. రోజూ అలా ఓసారి అందర్నీ పలకరించి, వారి వారి మంచిచెడ్డలు విచారించి, వారి క్కావలసిన విషయా లేవేనా వుంటే చెప్పి యింటికి రావడం ఆంజనేయస్వామిగారి కలవాటు.

అలాగే ఆనాడుగూడా బయల్దేర బోతున్న ఆయనకు, గజలక్ష్మమ్మగారి గర్జన వినిపించి ఆగిపోయారు. హడావుడి అంతా తగ్గాక బయల్దేరబోతూ వుంటే సుబ్బారావు వచ్చాడు చూడండి జాతకమంటూ. ఇన్నీ సరిదిద్దుకుని, సుబ్బారావును చూసి చెప్తానని చెప్పిపంపించి తాపీగా, పంచాంగం - ముహూర్త దర్పణం మున్నగు గ్రంథాలన్నీ తీసుకుని బయల్దేరారు ఆంజనేయస్వామిగారు.

అలా నాలుగడుగులు వేశారో లేదో, అప్పుడే మార్కెట్టునించి వస్తున్న పరంధామయ్యగారు పలకరించి, నిలవేశారు.

"నిన్న సాయంకాలమూ, ఇవ్వాళ పొద్దున్నా ఏమిటో మీ యింట్లో గంద్రగోళంగా వుంది?..." అని అడిగారు పరంధామయ్యగారు కొశ్చెన్మార్కు ముఖం పెట్టి.

"గంద్రగోళాని కేముంది? కాపురముంటున్న కల్యాణరామయ్యర్ భార్యతో పోరు! వాళ్లు వచ్చిన ఏ రెండు మూడ్నెల్లో సరసంగా ప్రవర్తించారు. ఇక తరువాత చూడండి అన్నిటికీ అడ్డమే! ముందు ముఖ్యంగా నీళ్ళవదలరు మా ఆవిడ పట్టుకోడానికి. మొదట మొదట యిది, పోనీలెమ్మని సర్దుకుపోతూ వచ్చింది. రాను రాను వాళ్ల ప్రవర్తన పెడదోవలు త్రొక్క మొదలెట్టింది. దాంతో ఘర్షణ! యింతకంటే ఏముంటుంది చెప్పండి!" అన్నారు ఆంజనేయస్వామిగారు అతి నింపాదిగా.

"మీ గృహిణీమణి గట్టిగా కాపురంచేసే యిల్లాలు గనుక సరిపోయిందిగాని, లేకపోతేనా!...ఆ కళ్యాణ రామయ్యర్ భార్య కామాక్షమ్మన్నదే...హబ్బో! అంతగయ్యాళి గంపను నేనింతవరకూ చూళ్లేదంటేనమ్మండి. యింతకుపూర్వం మా ఫ్రెండ్సింట్లో గూడా




# ★ రథులూ - మహారథులూ ★

వీళ్లు కాపురం వెలగబెట్టి వచ్చారులెండి! వీళ్ళ సంగతి వాళ్ళ నడగాల్సిందే గాని, నా వల్లగాదు, వాళ్ళ చిద్విలాసాలన్నీ చిత్రించ డానికి!" అన్నారు పరంధామయ్యగారు అదను కనిపెట్టి ఆమాత్రం అనగలిగినందుకు సంతసిస్తూ.

"అయితే...మీకు వాళ్ళనుగురించి యింతకుముందే తెల్సునన్నమాట!" అన్నారు ఆంజనేయస్వామిగారు ఆశ్చర్యం వెళ్లబుచ్చుతూ,

"హా...హా...దానికేం లెండి! తెలుసు గనక చెప్పాను!" అన్నాడు పరంధామయ్య గారు పళ్లికిలిస్తూ.

"సరే కానీయండి చూద్దాం! సరసంగా వుండగలిగితే వుంటారు. లేకపోతే యింకో యిల్లు చూచుకుంటారు. మనమూ మర్యాదకే చూస్తున్నాం! వాళ్లు మనకు శాశ్వతమా మనిల్లే వాళ్ళకు శాశ్వతమా!" అని గబగబా ముందుకు నడిచారు ఆంజనేయస్వామిగారు.

సమయానికి తగ్గట్టు సమిధ వేసినందుకు సంతోషిస్తూ యిల్లు చేరుకున్నాడు పరంధామయ్యగారు.

* * *

కూడుగుడ్డలకు లోటై కుంభకోణంనించి వచ్చి, హోటలు వెలయించి ఒచ్చిపోయే వారికి మంచివాడుగా మర్యాదస్తుడుగా మెలగుతున్న కళ్యాణరామయ్యర్ కాస్తో కూస్తో సంపాదించుకున్నాడు. ఊళ్ళో అందరూ అయ్యర్ హోటలుకు ఎగబడుతూ ఎకరాలకు ఎకరాలు ఎదజల్లుకున్నారు. కొన్ని కళ్యాణరామయ్యరే కొనుక్కున్నాడు. పదెకరాల దాకా పల్లపు భూమి సంపాదించాడు. అయితే యిల్లుమాత్రం ఇంకా కట్టించుకోలేదు ఎందుచేతో!

అందరికీ మంచివాడుగా ఉన్న అయ్యర్, ఆంజనేయస్వామిగారికీ ఆయన సతీమణికీ చెడ్డవాడుగా ఎందుకు కనిపిస్తాడో ఎవరికీ అంతుబట్టదు. అదే కాక, యిరుగు పొరుగుల్లో వుంటే పరంధామయ్యా, పాపారావూ వగైరాలు అయ్యర్‌ని అంతగా మెచ్చుకోలేరు. పదిగజాల దూరంలో ఉన్న పదనాభయ్యగారు మాత్రం—అయ్యరంటే అంతులేని వాత్సల్యాన్ని చూపిస్తారు.

నిజంగా అతడంత కంటకుడుగా వుంటే—పరాయిదేశంవచ్చి పదిరాళ్ళలా సంపాదించుకోగలుగుతాడు?...అర్థంపర్థంలేని అడ్డ వాళ్ళ తగాదాల నాధారం చేసుకుని, అయ్యర్‌ని అలా దుయ్యబట్టడం అవివేకం అంటారు కొందరు.

"అయ్యర్ తలుచుకుంటే—హోటలుకూ, కాపురముండడానికీ, కన్నుమూసి కన్ను తెరిచేలోపల కట్టించగలడు రెండంతస్తుల మేడ-ఏం! ఆంజనేయస్వామిగారి యిల్లే అతడికి శాశ్వతమా?!"..

ఇది అయ్యర్ అనుయాయులు అనే మాట.

"మద్రాసునంతా కూడగట్టుకొని, సాంబారు రుచిమరిపి, 'యిడ్లీ' అంటే ఎక్కడ లేనిమమతా కలిగించి, ఎకరాలకెకరాలు ఎగరతన్నుకు పోతున్నాడు అయ్యర్!"

పెద్దపెద్ద భూస్వాముల తంత్రులు పెట్టే గోలయింది.

"'యిడ్లీ-సాంబారు' రుచి, యింతింత కాదని మెచ్చుకుని, మెదువికోడా (మెత్తని పకోడా) మీకే చెయ్యాలి మేమేతినాలి." అని అహర్నిశలూ అంటూవుంటే పరంధామయ్యగారూ, పాపారావుగారూ, ఆంజనేయస్వామిగారు అమాంతం ఇలా మారిపోయారేమిటి?...

కొందరు కూటస్థులమాట యిది.

అందరికీ తలలోనాలుకలా తరతరాలుగా తెలుగువాడు కాకపోయినా ఆంధ్రులలో ఐక్యం అయిపోయిన అయ్యర్‌ని అన్నిరకాలుగానూ అంటూవుండడం ఆవూళ్ళో అలవాటు. అయినా ఏ కొద్దిమందో తప్ప—తక్కినవాళ్లంతా—అయ్యర్ని గూర్చి "అఘుంటవ్యక్తి-సమయానికి తగ్గట్టు నడుచుకోగల సమర్థుడు" అంటారు.

అయినా అయ్యరివన్నీ పట్టించుకోడు. యింట్లో ఇంతింత తగాదాలు తలెత్తుతున్నా పల్లెత్తుమాట అన్న పాపానపోలేదు అయ్యర్. తన వ్యాపారమేమో తనేమో. కోడికూతతో లేచి, మడి బుజానేసుకుని పోయేవాళ్లతో సమంగా నిద్రలేస్తాడు. పైన తుండుగుడ్డ వేసుకుని, అడ్డపంచ నడికట్టి బిగించి, తమలపాకులడబ్బా చేత్తోపుచ్చుకుని హోటలుకు వెళ్లి ఓంప్రథమంగా ఇడ్లీగిన్నె పొయిమీద ఎక్కిస్తాడు. అది మొదలు మళ్లీ రాత్రి ఏ తొమ్మిదికో పదికో కాని యిల్లు చేరడు. ఈలోపల యింట్లో ఏంజరిగినా, అయ్యరుకు అంతుపట్టదు. అంతు పట్టించుకోవాలని

(43.వ పేజీ చూడండి)


ఆ దగ్గును అణచండి-ఆ గొంతుపుండుకు ఉపశమనం కలిగించి మాన్పండి-రొమ్ము, శ్వాసకోశ బాధలను వెంటనే తొలగించండి




పెప్స్ సేవించండి.

**PEPS**

జగద్విఖ్యాతి గాంచిన

గొంతు, రొమ్ము టేబ్లెట్లు.

మందు అమ్మేవారి అందరివద్దా లభిస్తాయి.



పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన, నివారక సారములు కలవి. మీరు పెప్స్‌ను చప్పరించునపుడు ఈ సారములు ఆవిరిఅయి, మీ శ్వాసద్వారా గొంతుకలోనికి, శ్వాసమార్గం, శ్వాసకోశాలలోనికి కొనిపోబడుతాయి. ఇలా అవి పరావరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి. అందుకే పెప్స్ అంత శక్తివంతమై, జగద్విఖ్యాతి గాంచినవి. పెప్స్ దగ్గులను అణచివేస్తాయి. గొంతుపుండు బాధను ఉపశమింపజేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్ఫ్లుయెంజా, బ్రాంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి

సోల ఏజెంట్లు. దాదా & కో; 88, నైనప్పనాయక్ వీధి, మద్రాసు-1.

# ★ అతిరథులూ మహారథులూ ★

(24-వ పేజీ తరువాయి)

గూడా ఆలోచించినట్టు కనిపించదు అయ్యర్.

"ఇలాంటి, తీరికరగని జీవితం జీవిస్తున్న అయ్యర్ తగాదాలకొచ్చి కూర్చుంటాడంటే తక్షణమే నమ్మగలమా ?..."

ఇది ఒకపక్కనించొచ్చే వాదం.

"అతడు కాకపోవచ్చు-ఆయన కూతుళ్లూ, కొడుకులూ, ఏకమై - గజలక్ష్మమ్మగార్ని గడగడలాడిస్తారు!"

ఇరుగు పొరుగుల్లో కొందరనేమాట!

"ముగ్గురు కొడుకులూ, యిద్దరు కూతుళ్లూ ఉన్నారయ్యర్‌కు. చిలకల్లాంటి ఆ పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. వచ్చినప్పట్నించీ పచ్చగా వుంటున్నారు. చూసి ఓర్వలేని చుప్పనాతులంతా, లక్షణకుంటే మాత్రం - వాళ్లు రాణకెక్కేదేముంది! తెలివున్న వాడెప్పుడూ తెచ్చుకోగలడు పది రాళ్ళు. పొరుగూరినించి వచ్చి పొట్టపోసుకుంటున్న వాళ్లే ఐనా, యిష్టమొచ్చినట్టంటే ఎవరు పడతారు?...దానికి ఒక హద్దంటూ వుండొద్దూ!"...

ఏదీ పట్టించుకోనట్టుండే యంబారయ్యలాంటి వ్యక్తులు మాటాడే మాటయిది:

ఊరు ఎన్నివిధాల ఉండబట్టలేక అనుకుంటున్నా, తనని కాదన్నట్లే తనయింట్లో తగాదా లేం జరుగుతున్నట్లూ గూడా తలచకుండానే రోజులు గడిపేస్తున్నాడు అతి చాకచక్యంగల అయ్యర్.

*　　*　　*

అయిదారునెల్లు గడిచాయి. ఒకనాటి వెన్నెల రాత్రి, పెద్దబజారులో వెంకటటింటి వసారాలో సమావేశమైన పెద్దలంతా పట్టణ రాజకీయాలు పెద్దఎత్తున చర్చిస్తున్నారు. అందులో, అయ్యర్ విషయం అతిప్రధాన సమస్యగా ఎన్నుకుని, తలో రీతిగానూ తర్జన భర్జన మొదలెట్టారు:

"అయ్యర్-అమాంతం హోటల్‌లో లాడ్జింగ్ సెక్షన్ రద్దుపరచి, కాపురాన్నక్కడికి కదిలించిన కారణమేమైఉంటుందంటారు?"...



# ★ అతిరథులూ మహారథులూ ★

ఒచ్చి కూర్చున్నవారిలో ఒక సభ్యుని ప్రస్తావన:

"గజలక్ష్మమ్మగారి గడబిడకు తట్టుకోలేక, తరలించాడు తన సంసారాన్ని అయ్యర్!"...

అయ్యరంటే అభిమానంగల వ్యక్తి అన్న మాట లివి.

"అయితే అయిందిగాని, అన్నిరోజులు అవస్థపడ్డా, అనాయాసంగా అయ్యర్ని ఒదిలించుకున్న ఆంజనేయస్వామిగారు అదృష్టవంతులనే చెప్పాలి; ఆయన్ను అభినందించాలి!"...

పరంధామయ్యగారి పలుకులివి:

"అయ్యర్ని ఒదిలించుకోటం మాటెలావున్నా - ఆంజనేయ స్వామిగార్ని ఒదిలించుకుని అయ్యర్ అవతలపడ్డాడేమో అనిపిస్తుంది!"

పద్మనాభయ్యగారు పట్టి పట్టి అన్న మాటలివి:

"అది ఎంతమాత్రమూ కాదు, పద్మనాభయ్యగారు, ఎంతసమర్థించచూచినా, పాక్షికంగానేవుంది ఆ సమర్థన! కుంభకోణం అయ్యరతను, కూర్చునే గుళ్లో, గోపురాలూ మింగేయగలడు! తనకేమాత్రమో తక్షణమే లాభిస్తుందని తోచకపోతే, తరలిస్తాడా తన సంసారాన్ని ?"

పాపారావు పరిశీలనగా అన్నమాటలు:

అధ్యక్షులవారు అన్నివాదాలూ విని కడకు తేల్చినసారాంశం:

"ఎవరిబాధనుండి ఎవరు తప్పించుకున్నా, ఫలితం ఒక్కటే!...వీరిబాధ వీరికీ తీరింది; వారిబాధ వారికీ తీరింది. గజలక్ష్మమ్మగార్ని గదులన్నిటిలోనూపడి దొర్లమనండిక! ఎవరికేంవచ్చిందిగనక మధ్య ?!"...

"ఎవరికీ ఏమీ లేకపోతే ఈ దచ్చు సమావేశాలన్నీ ఎందుకు?...ఎవర్నుద్ధరించను?"

అందరూ కలిసి అన్నమాటలు.

అధ్యక్షులవారికి అమాంతం కోపంవచ్చి సమావేశాన్ని కాలనిర్ణయంలేకుండా వాయిదాపడేసి, పైపంచె దులుపుకుని, రుసరుసలాడుతూ రూటుమార్చి—యింటికికాక ఇంకెక్కడికో వెళ్లిపోయారు అంత అర్థరాత్రిలోనూ, అందర్నీ తిట్టుకుంటూ.

సభ్యులంతా 'తలోరీతిగానూ విమర్శించుకుంటూ రాత్రి సమావేశాల్ని ఇకనుంచీ రద్దుచెయ్యాల్సిందే ననుకుంటూ ఆ రాత్రికి, ఎవరిళ్లకు వారు చేరుకున్నారు.

* * *

అటుతరువాత నాల్గురోజులకు అపరాధ పరిశోధకు డొకాయన శ్రమించి సేకరించి చెప్పిన తాజావార్తలివి:

"అయ్యర్ కూతురు అరుంధతీఅమ్మాళ్ ను ఆంజనేయ స్వామిగారి కుమారుడు అప్పారావు ప్రేమిస్తున్నాడన్న విషయం కర్ణాకర్ణిగా విన్న కల్యాణరామయ్యర్ సొంతయిల్లు కట్టుకున్నాక వెళదామనుకునీ త్వరపడి యిల్లుఖాళీచేసి, హోటలు పైఅంతస్తులోకి కాపరాన్ని మార్చేశాడు; అంతేగాని, గజలక్ష్మమ్మగారికి జడిసిగానీ, ఆంజనేయ స్వామిగారికి హడిలిపోయిగానీ కాదు. అసలు రహస్యం ఇది!" అని.

ఇది వినగానే, యింతక్రితం సమావేశాలు జరిపి, సతమతమైన సభ్యులందరూ, కల్యాణరామయ్యరూ, ఆంజనేయ స్వామిగారూ, అమాంతం విస్మయంకులై కూచున్నందుకు, తమను తామే దూషించుకున్నారు. తగూలు పడింది తాముగాని, వారుగాదని తెలుసుకున్నారు. ముక్కుమీద వేలేసుకున్నారు. అధ్యక్షులవార్ని అవలోకించారు.

ముందు ముందు ఇలాంటి చర్చలు మళ్లీ చెయ్యకూడదని మనిషికి మనిషి మాట ఇచ్చుకున్నారు. తమలో తాము తగూలుపడ్డం తగదనుకున్నారు. తలోదారినా బయలుదేరి వెళ్ళారు సమావేశాన్ని సమాప్తంచేసి!

* * *

ఈవార్త అలా అలా వ్యాపించి-ఇరుగు పొరుగు అమ్మలక్కలమూలంగా ఇంటికి చేరగానే, అనుమానంవేసి, అంతక్రితం రాత్రినించీ యింటికిరాని అప్పారావుకోసం ఆంజనేయస్వామిగారు హడావిడిగా పరుగులెత్తారు బజార్లవెంబడి.

సగందూరం వెళ్లేలోపలే-సమాచారం యావత్తూ కనుక్కుని వస్తున్న పరంధామయ్యగారు ఎదురై-ఆంజనేయస్వామిగార్ని ఆపాదమస్తకం పరిశీలించి, తనకు తెలిసిన సమాచారం యావత్తూ ఆంజనేయస్వామిగారికి అంతక్రితమే అవగతమై ఉంటుందని అనుకుని, చిరునవ్వు ముఖాన చిందించుతూ,

"కల్యాణరామయ్యర్ కూతురి కరగ్రహణం చేశాట్ట మీ అబ్బాయి అప్పారావు!"... అని ఆంజనేయస్వామిగారి అనుమానం తీరేలా అతినింపాదిగా అక్షరమక్షరమూ పట్టి పట్టి అన్నారు!

పరంధామయ్యగారీమాట అనీ అనగానే అసలే ఆవేదన పడుతున్న ఆ మహాపండితుడు, భావికాలజ్ఞుడైన, ఆంజనేయ స్వామిగారు,

"హరి కులపాంసనుడా !!"... అంటూ అక్కడే కుప్పలా కూలబడిపోయారు! ★


## పూవు మీ అదృష్టం చెప్పగలదు



నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డు పైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభ నష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగును. నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపుడు చేయడమగును. వివరములు మా పూచీపైని పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ ఉద్దేసు ఇంగ్లీషులో వ్రాయండి.

Shree Swamy Satyanarain, Raj Jyotishi,. (WPA) Phagwara. (Pb)



## నారసింహ లేహ్యము




బంగారుతో చేరినది మేహము, నిక్షాక, నిస్సత్తువ వగైరా హరించి. బలము రక్తవృద్ధి కల్గించును. 20తు. డబ్బి రు 3-4-0. పోస్టేజి రు. 1-1-0.

పి. సి. ఏ. అండ్ కో, (ఆయుర్వేద సమాజం)
పెరిదేవి (పోస్టు) — నెల్లూరుజిల్లా.



నంజన్ గూడు పండ్లపొడివారి

## జ్వరేగ్

సకల జ్వరములను అద్భుతముగా నివారించును.

క్యాటలాగ్ ఉచితము

హోల్ ఏజంట్లు యునైటెడ్ కన్సర్న్, మదరాసు-1.

బ్రాంచీలు: హైదరాబాదు & విజయవాడ.